

అయోధ్య అక్షింతల పంపిణీ



మూసాపేట: ఇంటింటికీ అయోధ్య అక్షింతల వితరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భాగంగా మూసాపేట జనతానగర్‌లోని శ్రీ పాండురంగస్వామి దేవాలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం జనతానగర్‌లో స్వామివారి అక్షింతలకు ఊరేగింపు నిర్వహించి ఇంటింటికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, లక్ష్మీ నారాయణ, యోగేష్ ప్రభు, వినోద్, పాండే, భీమ్లా, బిరాదర్ రాము, జిల్లా అక్షయ్, ఈశ్వర్, ఉదయ్, ప్రశాంత్, సంజయ్, చరణ్, అశోక్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఆల్విన్ కాలనీలో

ఆల్విన్‌కాలనీ: శ్రీ లక్ష్మీ నరసింహ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తులసీనగర్ కాలనీ వాసులకు అయోధ్య రామ మందిర ట్రస్ట్ బోర్డు నుంచి వచ్చిన శ్రీరాముని అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ జితేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వెంకటరమణ, రామాచారి, రామరాజు, కుమార్‌యాదవ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.




అక్షింతల పంపిణీలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ తదితరులు

శిలాఫలకానికే పరిమితమా..?

- ముందుకు సాగని సీసీ రోడ్డు నిర్మాణం
- తులసీనగర్ వాసుల అవస్థలు
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు




తులసీనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన శిలాఫలకం, తులసీనగర్‌లో రోడ్డు దుస్థితి

ఆల్విన్‌కాలనీ: ప్రజలకు మౌలిక వసతులు కల్పించాల్సిన పాలకులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో తులసీనగర్ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నికల ముందు హడావిడిగా సీసీ రోడ్డు నిర్మాణానికి శిలాఫలకం వేసిన ప్రజా ప్రతినిధులు ఆ మాటే మరిచిపోయారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సైతం మోహం చాటేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే...కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ తులసీనగర్ వాసులు రెండేళ్లుగా మురుగునీరు, వర్షపు నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల అవస్థలను గుర్తించిన ఎమ్మెల్యే, అధికారులు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరుకావడంతో రోడ్డును తవ్వి చదును చేశారు. ఈ నేపథ్యంలో ఆరు నెలల క్రితం సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అయితే ఆ తర్వాత ఎన్నికలు రావడంతో పనులు ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో రాళ్లతో రహదారిపై నడవడం కూడా ఇబ్బందికరంగా మారడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. డ్రైనేజీ పనులు పూర్తయి సంవత్సరాలు గడుస్తున్నా రహదారిని నిర్మించకపోవటం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సుమారు రూ.30 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనుల కోసం వేసిన శంకుస్థాపన శిలాఫలకం దిష్టిబొమ్మలా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకుని సీసీ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.



రంగనాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ధనుర్మాస పూజల్లో పాల్గొన్న భక్తులు

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు సమీపంలోని శ్రీ రంగనాయక స్వామి దేవాలయంలో ఆదివారం ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి లక్ష తులసీ అర్చన, సాయంత్రం దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భరత్‌నగర్ కాలనీలోని హరి హర క్షేత్రంలో రాముల వారి ఆలయంలో సీతారామలక్ష్మణులకు తులసీ అర్చన నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన దీపోత్సవంలో మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై దీపాలు వెలిగించారు.

రెడీమిక్స్ ప్లాంట్ ఏర్పాటుపై నిరసన



ఆందోళన చేస్తున్న వర్టెక్స్ ప్రీమియో అపార్ట్‌మెంట్ వాసులు

భాగ్యనగర్‌కాలనీ: జనావాసాల మధ్య రెడీమిక్స్ ప్లాంట్ ఏర్పాటును నిరసిస్తూ వర్టెక్స్ ప్రీమియో అపార్టుమెంట్ వాసులు ఆదివారం ఆందోళనకు దిగారు. హైదర్‌నగర్ డివిజన్ ప్రణీత్ ఎక్సోరా నిర్మాణ సంస్థ వర్టెక్స్ ప్రీమియం పక్కన నిర్మాణ పనులు ప్రారంభించారు. నిర్మాణానికి అవసరమైన రెడీమిక్స్ తయారీకి ఇళ్ల మధ్యే ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ప్లాంట్ నిర్మాణంతో సమీపంలో వున్న వర్టెక్స్ ప్రీమియో నివాసాల్లోకి దుమ్ము, ధూళి కాలుష్యం బారిన పడుతున్నామని వారు ఆరోపించారు. ప్లాంట్ ఏర్పాటుతో ఇళ్లలోకి చేరే వ్యర్థాలతో రోగాలు వస్తాయని, ఆరోగ్య సమస్యలు పెరుగుతాయన్నారు. ప్లాంట్ నిర్మాణ విషయమై జీహెచ్‌యంసీ పొల్యూషన్ బోర్డుకు సైతం ఫిర్యాదు చేశామని ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదని ఆరోపించారు.

శుభాకాంక్షలు...



మూసాపేట: కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా పదవీబాధ్యతలు చేపట్టిన కృష్ణ మోహన్‌ను ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు చున్నూ పాషా ఆధ్వర్యంలో పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రేమ్ సాగర్, నాయకులు ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.



భరతనాట్య ప్రదర్శన

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సుభద్ర నృత్య విహార్, స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌కు చెందిన కళాకారులు భరతనాట్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఇందులో పుష్పాంజలి, అలరిపు, జతిస్వరం, దేవిస్తుతి, వరవీణ, దశావతార తదితర అంశాలను విదూషి సుబ్రత, యోగిత, తేజ, యశస్విని, ఖుషి, లిపి, ద్యుతి, సాక్షి, విస్మిత ప్రదర్శించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని సిండికేట్ బ్యాంక్ ఆఫీసర్స్ కాలనీ, షేర్‌గల్లీ, దుబాయిగేట్‌లో నిర్మించనున్న సీసీ రోడ్డును ఆదివారం స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో అభివృద్ధి పనులను 80 శాతం పూర్తి చేశామన్నారు. ప్రజల కోరిక మేరకు ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు శంకర్ శాస్త్రీ, మాణిక్‌రావు, సూర్యప్రకాశ్, సుదాకర్, బాలాజీ, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పెంటయ్య, బుర్రి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం మల్లికార్జున స్వామి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ తదితరులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని మల్లికార్జున స్వామి వారి కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. యాదవ సంఘం అధ్యక్షుడు ఎక్కల్‌దేవ్ గోపాల్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో రుద్రాభిషేకం, కోట్నం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునయాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు మక్కాల నర్సింగ్‌రావు, కనకరాజుయాదవ్, బుర్రి యాదగిరి, కర్రె జంగయ్య పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

9న 'మనూ'లో ప్రత్యేక ఉపన్యాసం

రాయదుర్గం: మనూ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 9వ తేదీ ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని డీడీఈ ఆడిటోరియంలో ఉదయం 10.30 గంటలకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డబ్ల్యూఆర్ఐ ఇండియా సీనియర్ ఫెలో అమితాబ్ కుందు 'ఇండియా టువర్డ్స్ ఇన్‌క్లూజివ్ అండ్ సస్టైయినబుల్ డెవలప్‌మెంట్ అవకాశాలు, చాలెంజెస్' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసం ఇస్తారు.

ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

రాయదుర్గం: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 5వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచినట్టు గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల ప్రిన్సిపల్ శారద తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.100 రుసుము చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు.

ఫస్ట్ ఫ్యాషన్ కేలండర్ ఆవిష్కరణ

గచ్చిబౌలి: ఫస్ట్ ఫ్యాషన్ కేలండర్ 2024ను పలువురు నటీనటులు ప్రారంభించారు. గచ్చిబౌలిలోని ఐ బొటిక్, స్టూడియోలుక్స్ ఆధ్వర్యంలో కేలండర్‌ను ఆవిష్కరించి సినీ తారలు సందడి చేశారు. సినీ నటులు నవీన్‌చంద్ర, వెంకట్, చైతన్య రావు ,కృష్ణుడు, కామాక్షి భాస్కర్ల, ప్రణీత పట్నాయక్, అశ్విన్ తదితరులు ఉన్నారు. కొత్త కాన్సెప్ట్‌తో కేలండర్‌ను షూట్ చేశామని ఐ బొటిక్ నిర్వాహకులు డాక్టర్ జగదీశ్‌రెడ్డి, డాక్టర్ ప్రణతిరెడ్డి పేర్కొన్నారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు



సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న సినీ నటుడు మురళీ మోహన్, తదితరులు




కూకట్‌పల్లి: కాకతీయ సేవా సమితి కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ జంట నగరాల్లో మొట్టమొదటిసారి దాదాపు 16 వేల మందికి పైగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు. తెలుగు సాంప్రదాయం ఉట్టిపడేలా మహిళలు, చిన్నారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు, చిన్నారులకు గాలిపటాలు పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సినీనటుడు మాగంటి మురళీ మోహన్, కోడే దుర్గా ప్రసాద్, చల్లా రాజేంద్ర ప్రసాద్, కెవి. చౌదరి, కూరపాటి కృష్ణయ్య, నిమ్మగడ్డ ఉపేంద్ర నాథ్, సత్యవాణి తదితరులు సన్మానించారు. వీరు సమాజానికి చేస్తున్న సేవలను కొనియాడారు. అద్భుతమైన కార్యక్రమం నిర్వహించినందుకు కాకతీయ సేవా సమితి సభ్యులను అభినందించారు.

ముగ్గుల పోటీలు సంప్రదాయాలకు ప్రతీక



ముగ్గుల పోటీల విజేతలతో కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: ముగ్గుల పోటీలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సెవెన్ హిల్స్‌లో ఆదివారం నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీల కార్యక్రమానికి ఆయన కేపీహెచ్‌బీ ఎస్ఐ మౌనిక రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా నార్నే శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలు ఉదయం ఇళ్ల ముందు ముగ్గులు వేయడం మంచి వ్యాయామమన్నారు. దీంతో పాటు మహిళల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. ముగ్గుల పోటీలు ఐక్యతకు, ఆప్యాయతకు నిదర్శనమన్నారు. సంక్రాంతి పండుగ ప్రకృతి పండుగ అన్నారు. సాంస్కృతిక అంశాలు మానసిక వికాసానికి, శారీరక ఆరోగ్యానికి, ఏకాగ్రతకు తోహదపడతాయని తెలిపారు. సంక్రాంతి సంబురాల్లో సోదరీమణులు భాగస్వాములు కావటం అభినందనీయమన్నారు. సంస్కృతి, సంప్రదాయాలు, సంక్రాంతి పండుగ విశిష్టతను నేటితరం వారికి తెలియజేయడం ఈ ముగ్గుల పోటీ ప్రత్యేకతగా పేర్కొన్నారు. అనంతరం డివిజన్ ప్రజలందరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

రాహుల్ రెండో విడత యాత్రతో రాజకీయాల్లో పెను మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ ఈ నెల 14 నుంచి చేపట్టనున్న రెండో విడత పాదయాత్రతో జాతీయ రాజకీయాల్లో పెను మార్పు సంభవిస్తుందని టీపీసీసీ మాజీ జాయింట్ సెక్రటరీ, ఓయూ జేఏసీ నేత ఏగూరి ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. మొదటి విడత చేపట్టిన భారత్ జోడో యాత్రతో దక్షిణాదిన పుంజుకున్న పార్టీ రెండో విడతలో ఉత్తరాదిన మరింత బలోపేతం అవుతుందన్నారు. ఈ నెల 14న ముంబయిలో ప్రారంభమై మణిపూర్ వరకు 6,700 కిలోమీటర్ల వరకు చేబట్టబోవు పాదయాత్ర ప్రజలను ప్రభావితం చేస్తుందన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం, సామాజిక, లౌకికవాద భావాలకు తిలోదకాలిచ్చిన బీజేపీకి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని జోష్యం చెప్పారు. తెలంగాణలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన బీఆర్‌ఎస్ నేతలకు కూడా పార్లమెంట్ ఎన్నికల ఫీవర్ పట్టుకుందన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ఊహించని విధంగా కాంగ్రెస్ పార్టీ అధికార పగ్గాలు చేపట్టిన నెల లోపే పథకాల అమలుపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

30 రోజుల కాంగ్రెస్ పాలనపై సంబురాలు

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి 30 రోజులైన సందర్భంగా ఓయూలో విద్యార్థులు, నిరుద్యోగులు కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆదివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నెల రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పర్చడంలో సీఎంతో పాటు మంత్రులు చేస్తున్న కృషిని అభినందించారు. భవిష్యత్ సుపరిపాలనకు ఇది తొలిమెట్టు అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ బాలలక్ష్మీ, డాక్టర్ రామేశ్వర్‌రావు, శ్రీను, జానకిరాములు, వెంకట్ పాల్గొన్నారు.

హెచ్‌సీయూ ఆర్టీసీ డిపోలో వనభోజనాలు

రాయదుర్గం: ఆర్టీసీ ఉద్యోగుల్లో ఐక్యత, స్నేహభావం పెంపొందించడానికే వనభోజనాలు ఏర్పాటు చేయడం జరుగుతోందని ఆర్టీసీ కూకట్‌పల్లి డివిజన్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ ఆర్ కవిత పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపోలో ఆదివారం వన భోజనాలను డిపో మేనేజర్ ఎంఎంరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో బిజీగా ఉండే ఉద్యోగుల్లో ఉల్లాసాన్ని నింపేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి డిపోలో ఆదాయం పెంపు, వ్యయం తగ్గించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ డిపో అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ ప్రశాంత్, ఎంఎఫ్ రహమాన్, ఉద్యోగులు పాల్గొన్నారు.









'చిల్డ్రన్స్ థీమ్ పార్కు'

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలోని భెల్ ఎంఐజీ కాలనీలో 'చిల్డ్రన్స్ థీమ్ పార్కు'అందుబాటులోకి వచ్చింది. ఈ పార్కును 5.3 ఎకరాల్లో నిర్మించారు. ఎంఐజీ కాలనీలోని వాణి విద్యాలయం సమీపంలో ఉన్న పార్కులో ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, సైకిల్ ట్రాక్ ఏర్పాటు చేశారు.యోగా ఫ్లాట్‌ఫారమ్, బర్త్‌డే, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర కార్యక్రమాలను నిర్వహించుకునేలా ఆంఫీ థియేటర్‌ను అందంగా తీర్చిదిద్దారు. పార్కు చుట్టూ గోడలకు వేసిన పక్షులు, చేపలు, చోటా భీమ్ బొమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.





ఓపెన్ థియేటర్ గోడలకు వేసిన రంగురంగుల చిత్రాలు




భెల్ ఎంఐజీ కాలనీలోని చిల్డ్రన్స్ థీమ్ పార్కు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462
9705444132